www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 జూన్ 2024
5
ఏలూరు

శ్రీశ్రీ కుమారుడి మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శ్రీశ్రీ కుమారుడు శ్రీరంగం వెంకటరమణ మృతికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 59 ఏళ్ల వయసులో అనారోగ్యంతో అమెరికాలో మృతి చెందినట్లుగా ఆయన బావమరిది గుంటూరులో ఉంటున్న డాక్టర్ రమణ యశస్వి శుక్రవారం వార్తల ద్వారా తెలిపినట్లు చెప్పారు. వెంకటరమణ భార్య మాధవి గణపవరం వాస్తవ్యులుగా తెలిపారు. 25 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లి ఫైజర్ కంపెనీ పరిశోధన విభాగంలో ఉద్యోగంలో చేరారని పేర్కొన్నారు. ఈ దంపతులకు కుమారుడు శ్రీనివాస్, కుమార్తె కవిత ఉన్నారన్నారు. ఆయన మరణంతో సాహితీ లోకం దిగ్భ్రాంతికి గురైందన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతికి సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు చెప్పారు.

కౌలు రైతులకు..

రుణార్హత కార్డులేవీ..!

- నేటికీ ప్రారంభం కాని కౌలుకార్డుల జారీ ప్రక్రియ
- ఖరీఫ్ నారుమడులకు రైతులు సన్నద్ధం
- బ్యాంకుల నుంచి పంట రుణాలు అందేనా
- రెండు జిల్లాల్లో 3 లక్షల మంది కౌలురైతులకు అన్యాయం
- కౌలుచట్టంలో కొత్త ప్రభుత్వం మార్పులు తెచ్చేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా వ్యవసాయ సాగులో కీలకపాత్ర పోషిస్తున్న కౌలురైతులను ప్రభుత్వం, అధికార యంత్రాంగం గాలికొదిలేసింది. జూన్ రెండో వారంలోకి వచ్చినా ఇప్పటి వరకూ కౌలురైతులకు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించని దుస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆదరణ లేక నలిగిపోతున్న కౌలురైతులకు కార్డులు ఇచ్చే అంశంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖరీఫ్ నారుమడులు వేసేందుకు జిల్లా రైతాంగం సన్నద్ధమైంది. మెట్ట ప్రాంతంలో నారుమడులకు సంబంధించి దుక్కులు సైతం జరుగుతున్నాయి. అయినప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ చేపట్టకపోవడంపై కౌలురైతుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయసాగులో 70 శాతానికిపైగా వీరే చేస్తున్నారు. ప్రభుత్వాలు మాత్రం కౌలురైతులను పట్టించుకోవడం లేదు. వైసిపి ప్రభుత్వం కౌలురైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబించిన పరిస్థితి కొనసాగింది. దీంతో బ్యాంకుల నుంచి పంటరుణాలుగాని, రైతుభరోసా సొమ్ముగాని, పంట నష్టపరిహారంగాని ఏఒక్కటీ కౌలురైతులకు అందకుండాపోయింది. గడిచిన ఐదేళ్లలో రెండు జిల్లాల్లోనూ అరకొరగానే కౌలుకార్డులు జారీ చేశారు. మూడు లక్షల మంది కౌలురైతులు ఉండగా పట్టుమని లక్ష 50 వేల మందికి కూడా కౌలు కార్డులు మంజూరు చేయలేదు. కౌలుకార్డులు అందుకున్నవారిలో సగం మందికి కూడా బ్యాంకుల నుంచి పంటరుణాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది. ప్రతియేటా ఏప్రిల్‌లోనే గ్రామసభలు నిర్వహించి కౌలుకార్డులు అందజేత ప్రక్రియ ప్రారంభించేవారు. ఎన్నికల పేరుతో కౌలురైతులను పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితి ఉంది. దీంతో జూన్ నెల గడిచిపోతున్నా ఏఒక్క కౌలురైతూ కౌలుకార్డు అందుకోలేకపోయారు. కౌలుకార్డులు ఉంటేనే బ్యాంకులు పంటరుణాలు ఇచ్చేందుకు ముందుకొస్తాయి. లేకపోతే కనీసం పట్టించుకోని పరిస్థితి ఉంటుంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కౌలురైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి ఏర్పడింది. కౌలుకార్డుల జారీ ప్రక్రియపై ఏలూరు వ్యవసాయ శాఖ జెడి హబీబ్ భాషాను వివరణ కోరగా టార్గెట్లు నిర్ణయించుకున్నామని, జారీ ప్రక్రియ ప్రారంభించనున్నామని తెలిపారు.

కౌలుచట్టంలో మార్పులపై తీవ్ర చర్చ

వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలురైతులను దెబ్బకొట్టే కుట్రలకు దిగింది. అందులో భాగంగా 2011 కౌలుచట్టంలో మార్పులు చేసింది. 2019 పంట సాగుదారుల హక్కుల చట్టం పేరుతో కొత్త చట్టం తెచ్చింది. ఈ చట్టంలో అత్యంత దారుణమైన మార్పులు చేసింది. పాత చట్టంలో భూయజమానితో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేయాలని ఉండేది. వైసిపి తెచ్చిన చట్టంలో భూయజమాని అంగీకరిస్తేనే కౌలురైతులకు కౌలుకార్డులు జారీచేయాలని పెట్టారు. ఇది కౌలురైతులకు ఉరితాడుగా మారింది. కౌలురైతులకు కౌలు కార్డులు ఇచ్చేందుకు భూయజమానులు ససేమిరా అంటున్నారు. వారికి అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైన పరిస్థితి నెలకొంది. దీంతో గడిచిన ఐదేళ్లలో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కౌలుకార్డులు కూడా లేకపోవడంతో పండించిన ధాన్యాన్ని సైతం భూయజమాని పేరున అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇది కౌలురైతులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ నెల 12న కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. కౌలుచట్టంలో టిడిపి కూటమి ప్రభుత్వం మార్పులు తెస్తుందా అనే చర్చ కౌలురైతుల్లో నడుస్తోంది. భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులు జారీచేసేలా చట్టంలో మార్పులు చేయాలని అంతా కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం ఆ విధంగా చేస్తే కౌలురైతులకు మేలు జరగనున్నది. లేకపోతే వైసిపి ప్రభుత్వంలో మాదిరిగానే కౌలురైతులకు ఇబ్బందులు తప్పవని చెప్పొచ్చు.

కలెక్టర్ కృషి అభినందనీయం

రిటర్నింగ్ అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు జిల్లా కలెక్టర్ చేసిన కృషి అందరికీ స్ఫూర్తిదాయకం, అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, పలువురు రిటర్నింగ్ అధికారులు అన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసిన సందర్భంలో జిల్లాలోని వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి అభినందన సత్కారం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జెసి పూలమొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా జెసి లావణ్యవేణి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగడానికి చిత్తశుద్ధితో పని చేసి వృత్తి ధర్మాన్ని పారదర్శకంగా పాటిస్తూ, ఎవర్నీ నొప్పించకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ అభినందనీయులన్నారు. పోలింగ్ రోజున తమ ఓటు లేదనే మాట రాకుండా దోషరహిత ఓటర్ల జాబితా రూపొందించుకోగలిగామన్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులైన ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒలు ఎన్ఎస్‌కె.ఖాజావలి, వై.భవానీశంకరి, కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, ఎం.ముక్కంటి, డిఆర్‌ఒ డి.పుష్పమణి కలెక్టర్‌కు పూలమొక్కలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల అధికారుల కృషి, వారందరి సహకారం అద్వితీయమన్నారు. జిల్లా స్థాయి నుంచి గ్రామం వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ఇతర ఎన్నికల అధికారులు, అందరికీ ధన్యవాదాలు తెలిపారు.


కలెక్టర్‌ను అభినందిస్తున్న రిటర్నింగ్ అధికారులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

డిఐఒ ఎన్.నాగేశ్వరరావు

ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న డిఐఒ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎన్.నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన జీలుగుమిల్లి పిహెచ్‌సిని సందర్శించారు. ఆసుపత్రిలో ఓపిని, పలు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో నమోదైన డెలివరీ కేసుల గురించి ఆరా తీశారు. ప్రతి బుధవారం చిన్న పిల్లలకు వేసే టీకాలను పరిశీలించి టీకాలను సక్రమంగా వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానుండటంతో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాల పరీక్షలకు ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం పాలచర్ల రాజవరం సచివాలయ పరిధిలో పిహెచ్‌సి వార్డును పరిశీలించి బాలింతరాలు వద్దకు వెళ్లి చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి గాయత్రి, ఫార్మాసిస్టు నాగేశ్వరరావు, సువర్ణ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థలం అప్పగించండి

వేసవి విజ్ఞాన శిబిరంలో ముగింపులో వక్తలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు కేంద్రంగా శాఖా గ్రంథాలయం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. దానికి అవసరమైన స్థలం కేటాయిస్తూ సంబంధిత శాఖ తీర్మానం చేసింది. అయినప్పటికీ స్థలాన్ని అప్పగించని కారణంగా సంవత్సరాలు తరబడి గ్రంథాలయానికి సొంతగూడు ఏర్పాటు జరగడం లేదు. ఇప్పటికైనా గ్రంథాలయం నిర్మాణానికి స్థలాన్ని అప్పగించాలని పలువురు వక్తలు కోరారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో 21 రోజులుగా బాలల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమాన్ని శాఖా గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. గ్రంథపాలకులు కె.శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త మండే సుధాకర్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్, విశ్రాంత ఉపాధ్యాయులు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహణ సందర్భంగా బాలలకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు దాత బాలనాగు విజయసారథి సమకూర్చిన బహుమతులను అతిధుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బాలలకు శాఖా గ్రంథాలయం తరపున ప్రశంసాపత్రాలను గ్రంథపాలకులు అందజేశారు. ఈ నేపథ్యంలో బాలలతో తాము చదువు కొనసాగించినంతకాలం టీవీలకు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. వినియోగదారుల చట్టం ఫోరం జిల్లా ఛైర్మన్ ఎల్.మణికంఠ, ఇన్‌ఛార్జి జిల్లా అధ్యక్షులు పివివి.సత్యనారాయణ, పరిశీలకులు గంగాధరరావు మాట్లాడుతూ వినియోగదారుల చట్టం ప్రాముఖ్యత, అమలు తీరుపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ తుమ్మల ఉమామహేశ్వరరావు, గ్రంథపాలకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న పలువురు విద్యార్థులు తాము నేర్చుకున్న పరిజ్ఞానం ద్వారా ఎంఎంఎస్ఎస్ జాతీయ ప్రతిభా పురస్కార అన్వేషణ) ఉపకార వేతనాల మంజూరు కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ దారుణం

సిపిఎం నగర కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలోని ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థలు అధిక ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని సిపిఎం నగర కార్యదర్శి పి కిషోర్ విమర్శించారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతియేటా ప్రయివేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా స్కూలు, కాలేజీల ఫీజులు పెంచుకుంటూ పోతున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు, జిఒ 53, 54 ప్రకారం ప్రయివేటు స్కూలు, కాలేజీల్లో ఒకటి నుండి ఐదో తరగతి వరకు రూ.పది వేల లోపు, ఆరు నుండి పదో తరగతి వరకు రూ.15 వేలు వరకూ, కాలేజీల్లో సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల బట్టి రూ.15 నుండి రూ.17,500 వరకు మాత్రమే ఫీజులు వసూలు చేయాలని అన్నారు. అయితే ప్రయివేటు విద్యాసంస్థల్లో ఒకటి నుండి 5వ తరగతికి రూ.15 వేల నుండి రూ.40 వేల వరకు, ఆరు నుండి 10వ తరగతికి రూ.30 వేల నుండి రూ.65 వేల వరకు, కాలేజీల్లో అయితే రూ.70 వేల నుండి రూ.లక్ష వరకు ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఎక్కడా ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడం లేదని విమర్శించారు. 2009 విద్యాహక్కు చట్టప్రకారం 25 శాతం పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు కేటాయించాలని, అది ఎక్కడా అమలు చేయడం లేదని అన్నారు. పిల్లలకు తగిన వాష్ రూములు, క్లాస్ రూముల్లో బల్లలు, కుర్చీలు, ఫ్యాన్లు, స్కూల్ లైబ్రరీ, క్రీడా స్థలం తగిన సౌకర్యాలతో ఉండాలని. అవి ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. పిల్లలు సైకిళ్లు పెట్టుకోవడానికి షెడ్లు కూడా లేవని అన్నారు. స్కూల్ బస్సుల్లో సామర్థ్యాలకు మించి విద్యార్థులను కుక్కి ఎక్కిస్తున్నారని, ఆ వాహనాల ఫిటనెస్ కూడా సరిగా పట్టించుకోరని అన్నారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలు అమలవుతున్నాయా లేదా అనేది ప్రతి మూడు నెలలకు ఒకసారి విద్యా శాఖాధికారులు ఇన్‌స్పెక్షన్ జరపాలన్నారు. తక్షణమే ప్రభుత్వ నిబంధనలు అమలు చేయని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నగర నాయకులు కె.రామాంజనేయులు, వి.సాయిబాబు, వివిఎన్.ప్రసాద్, బి.జగన్నాథరావు, జి.రవికిషోర్, వైఎస్.కనకారావు, ఎం.అరుణకుమారి, హైమ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్‌లు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముత్యాలమ్మ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఉపాధి హామీ కూలీలకు ప్లే స్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముత్యాలమ్మ, జిల్లా నాయకులు దానియేలు అన్నారు. మండలంలోని గిరిజన గ్రామాలైన మేరకగూడెం, పండుగూడెం, చీమలవారిగూడెంల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న గిరిజనులను శనివారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ, దానియేలు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని కోరారు. పే స్లిప్పులు ఇవ్వడం వల్ల ఎవరు ఎంత పని చేశారో, ఎవరికి ఎంత సొమ్ము జమ అయిందో అనేది స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఉపాధి హామీ పని చేస్తున్న వారు తమ గ్రామం నుంచి పని చేసే ప్రదేశానికి వెళ్లడానికి దారి ఖర్చులు ఒక్కో మనిషికి రూ.50 ఖర్చవుతుందని, వాటిని అధికారులు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పనులు చేసి రెండు నెలలైనా డబ్బులు పడడం లేదన్నారు. ఈ డబ్బులు పడకపోవడానికి గల సమస్యలు పరిష్కరించాలన్నారు. అడుగు లోతు, రెండు మీటర్లు వెడల్పు తీసినా రూ.300 కూలి కూడా పడడంలేదన్నారు. పని చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతిఒక్కరికీ మస్తర్‌లో పేరు నమోదు చేసి పని చేయడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ముత్యాలమ్మ

థైరాయిడ్ టెస్టింగ్ యంత్రాన్ని వినియోగించాలి

సిబ్బందిని నియమించాలి: సిఐటియు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న థైరాయిడ్ టెస్టింగ్ మిషన్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీగా మార్పు చేసిందని, రోగుల సౌకర్యార్థం దాదాపు రూ.20 లక్షల విలువైన థైరాయిడ్ టెస్టింగ్ మిషన్‌ను కొనుగోలు చేసి పంపించిందని పేర్కొన్నారు. అయితే సంవత్సరకాలంగా ఈ థైరాయిడ్ మిషన్ మూలన పడి ఉందని తెలిపారు. దీనిని రోగుల పరీక్షల కోసం వినియోగించడం లేదని, థైరాయిడ్ టెస్టులు చేయడం కోసం సిబ్బందిని నియమించకపోవడం, ఉన్నవారికి ట్రైనింగ్ ఇవ్వకపోవడం వల్ల అత్యంత విలువైన థైరాయిడ్ టెస్టింగ్ మిషన్ నిరుపయోగంగా పడి ఉందని, దీనిని తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని, ప్రజల అవసరాలు తీర్చేలా థైరాయిడ్ మిషన్‌ను ఉపయోగించాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించి థైరాయిడ్ మిషన్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. రోజుకు కనీసం పది మంది రోగులు థైరాయిడ్ పరీక్షలు బయట చేయించుకుంటున్నారని, దీని వల్ల ఒక్కో రోగి రూ.500 నుండి రూ.వెయ్యి చొప్పున రోజుకు రూ.20 వేల వరకూ నష్టపోతున్నారని తెలిపారు. థైరాయిడ్ టెస్టింగ్ మిషన్‌ను వినియోగంలోకి తీసుకురాని పక్షంలో ఉద్యమం చేపడతామని ప్రకటించారు.

ద్వారకాతిరుమలలో స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమలలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది. స్కూల్స్ రీ ఓపెనింగ్ దగ్గర పడుతుండటంతో శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనానికి తరలి వచ్చారు. రద్దీ పెరిగిపోవడంతో టోల్ గేట్ వద్ద నుంచి ఉగాది మండపం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. యాత్రికులు, పొరుగు గ్రామాలైన రాళ్లకుంట, సత్తెనగూడెం గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రిలయన్స్ సూపర్ మార్కెట్ వైపు వన్‌వే రూల్స్ ఉన్నా ట్రాఫిక్ పోలీస్ లేకపోవడంతో వాహనాలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీస్ వారు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


నిలిచిపోయిన వాహనాలు

రాజకీయాల్లో నిస్వార్థ సేవకురాలు సీతాదేవి

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - కలిదిండి

రాజకీయాల్లో నిస్వార్థ సేవకురాలు మాజీ మంత్రి ఎర్నేని సీతాదేవి (74) అని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని కొండూరులో సీతాదేవి సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గత ఎనిమిది నెలల క్రితం మృతిచెందిన భర్త ఎర్నేని నాగేంద్రనాథ్ రైతాంగ సమస్యలపై పోరాడేవారని, ఆయనకు అండగా ఉంటూ ఎంఎల్‌ఎగా, మంత్రిగా సమర్థవంతంగా పని చేసిన ఘనత సీతాదేవిది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు, మేధావుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు, గుడివాడ ఎంఎల్‌ఎ వెనిగండ్ల రాము, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ యార్లగడ్డ రవికుమార్, మాజీ ఎంఎల్‌ఎలు మూల్పూరి బాలకృష్ణ, దాసరి బాలవర్ధనరావు, కరణం బలరాం, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చల్లగుళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, రైతు నాయకులు వెలగపూడి ఆజాద్, నరసింహులు నాయుడు, నాయకులు తాడినాడ బాబు, వీరమల్లు నరసింహరావు, బొర్రా చలమయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సంస్మరణ సభలో మాట్లాడుతున్న వక్తలు

అంతర్మథనం.. అగమ్యగోచరం..!

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఉమ్మడి జిల్లావాసులను నివ్వెరపర్చాయి. అధికార వైసిపిని టిడిపి కూటమి అన్ని సీట్లలో ఊడ్చేసింది. కనీసం గట్టిపోటీ ఇస్తారనుకున్న సీట్లలో సైతం భారీ మెజార్టీతో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. టిడిపి, జనసేన శ్రేణులు సైతం ఫలితాల తీరు చూసి ఆలోచనలో పడ్డారంటే ప్రజలు ఎంత మౌనంగా తమ పని కానిచ్చారనేది అర్థం చేసుకోవచ్చు. అదే సమయంలో వైసిపి అభ్యర్థులు, నేతలు ఫలితాలపై తలలు పట్టుకుంటున్నారు. ఏం జరిగింది, ఎందుకు జరిగింది అంటూ విశ్లేషణల్లో మునిగి తేలుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాలను టిడిపి కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. అదీ పోలవరం మినహా అన్నిచోట్లా పరిశీలకులు, విజేతలు సైతం ఊహించని మెజార్టీలతో కూటమి విజయ పరంపర సాధించింది. త్వరలోనే కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఆపై ఎంఎల్‌ఎలు సైతం ప్రమాణస్వీకారం చేయనున్నారు. అదే సమయంలో తమ భవిష్యత్తు ఏమిటని వైసిపి నేతలు అంతర్మథనంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో చోటుచేసుకున్నంత స్థాయిలో దాడులు, ప్రతిదాడులూ రెండు జిల్లాల్లో చోటుచేసుకోకపోయినా క్యాడర్‌ను నిలబెట్టుకోవడం ఎలాగో అర్థం కాక వైసిపి నేతలు తలలు పట్టుకుంటున్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తుదామంటే కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలి. అదీగాక ఇప్పటి వరకూ అధికారంలో ఉన్న మీరేం చేశారని జనం నిలదీస్తే ఉన్న పరువు కూడా గంగ పాలవుతుందని అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో ఫలితాలపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఎందుకంటే రెండు జిల్లాల్లో స్థానిక సంస్థల పదవుల్లో 70 శాతానికి పైగా వైసిపి నేతలే ఉన్నారు. వారు కూడా ఎన్నికల ముందు స్వపక్షంపైనే అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించే పరిస్థితి లేకపోగా ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించడంతో తాము ఉత్సవ విగ్రహాల్లా మారామని, గ్రామాల్లో ప్రజలకు

ముఖం చూపించలేకపోతున్నామని పలు సందర్భాల్లో వాపోయారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం నిధులిస్తే గ్రామాల్లో పనులు చేపట్టవచ్చునేది వారి అభిప్రాయం. ఎలానూ జన్మభూమి కమిటీల ఆలోచన ఏమీ కన్పించడం లేనందున గ్రామాభివృద్ధే లక్ష్యంగా చేపట్టే పనులకు టిడిపి నేతలు అభ్యంతరం, ఇబ్బంది పెట్టే అవకాశం ఉండదని వారు చెబుతున్నారు. అదే సమయంలో కొంతమంది సర్పంచులు అధికారపక్షంలోకి దూకేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల పరిస్థితి తెలియంది కాదు. ఎంఎల్‌ఎలతో సయోధ్య, టిడిపి నేతలతో సమన్వయంతో ఇబ్బంది లేకుండా చూసుకోవాలనే యోచనలో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు రాజీనామాల బాట పట్టారు. ప్రధానంగా సొసైటీల్లో ఉన్న త్రిసభ్య కమిటీలు, దేవస్థానాల పాలకమండళ్లకు సంబంధించి ఇప్పటికే కొంతమంది తమ పదవులకు రాజీనామాలు సమర్పించారు. అసెంబ్లీ కొలువుదీరేటప్పటికీ ఈ ప్రక్రియ మరింత వేగం కావచ్చని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో జనంలో నిలబడి ఈ ఐదేళ్లలో ఎలా పుంజుకోవాలోనని నేతలు అంతర్మథనంలో ఉండగా కేడర్, ప్రధానంగా వాలంటీర్లుగా పని చేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని చెప్పవచ్చు. ఏదేమైనా సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో వైసిపి విలవిల్లాడుతుండగా టిడిపి కూటమి నేతలు మాత్రం ఈ విజయాల రికార్డును ఎలా నిలబెట్టుకోవాలి, ఎలా పదిలపర్చుకోవాలనే దానిపై సమాలోచనలు చేస్తుండటం విశేషం. ఏదేమైనా ప్రజల ఆకాంక్షలు నెరవేరిస్తే ఏ నేతకైనా, పార్టీకైనా భవిష్యత్తు ఉంటుంది, లేకపోతే తిరస్కరణ తప్పదని ఈ ఎన్నికల్లో ప్రజలు చాలా నిశబ్ధంగా ఓటుతో చెప్పకనే చెప్పారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

-విఎస్ఎస్వి.ప్రసాద్

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - మండవల్లి

సీజనల్‌గా సంభవించే వ్యాధులపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని లోకుమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సుమ, జోషిమా తెలిపారు. తక్కెళ్ళపాడులోని ఆరోగ్య కేంద్రంలో వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రుతుపవనాల ప్రభావంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయన్నారు. నిన్న, మొన్నటి వరకు అధిక ఉష్ణోగ్రతల నమోదుతో ప్రజలు అల్లాడిపోయారని, ప్రస్తుతం రుతుపవనాల రాకతో వర్షాలు పడుతుండటంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని చెప్పారు. దోమ కాటు వల్ల ప్రాణాంతక వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టే విధంగా ప్రతిఒక్కరూ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమైన దోమలు అభివృద్ధి చెందుతాయన్నారు. నివాస ప్రాంతాల్లో ఉన్న టైర్లు కొబ్బరి బొండాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటూ ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షంలో అధికంగా తడవ రాదని, జ్వరం, జలుబు, తుమ్ములు, దగ్గు వంటివి సంభవిస్తే వెంటనే వైద్యుల సలహాలతో మందులు వాడి రసం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు జ్వర పీడితులను గుర్తించి వారికి సత్వరమే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏనిమిది గ్రామాల్లో ఫ్రై డే శుక్రవారాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తూ మురుగు ఉన్న ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ సున్నంతో పాటు ఎబెట్ మందును పిచికారి చేయాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా అభివృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్‌ను వేస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జూన్‌లో మలేరియా, జులైలో డెంగీ మాసోత్సవాలను నిర్వహించి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ దోమ కాటు వల్ల వచ్చే రోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలు దోమల ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన పెంచుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను అందిపుచ్చుకుని వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలని వారు సూచించారు.

ఎంఎల్ఏ ధర్మరాజుకు సర్పంచి దంపతుల అభినందన

ప్రజాశక్తి - భీమడోలు

పోలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం, షేక్ హసేన దంపతులు ఉంగుటూరు నూతన ఎంఎల్ఏగా ఎన్నికైన పత్సమట్ల ధర్మరాజును మర్యాదపూర్వకంగా శనివారం ఆయన కార్యాలయంలో కలిశారు. మెజార్టీతో విజయం సాధించిన ఎంఎల్ఏను అభినందించి సత్కరించారు. గ్రామాభివృద్ధి విషయమై ఆయన సహకారాన్ని అభ్యర్థించారు.

ధర్మరాజును అభినందిస్తున్న సర్పంచి దంపతులు

బాధిత కుటుంబానికి ఎంఎల్ఏ పరామర్శ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని వట్టిగుడిపాడు గ్రామంలో ఇటీవల మరణించిన మునుసూరు రంగమ్మ పెదకొలను కార్యక్రమం సందర్భంగా నూజివీడు ఎంఎల్ఏ ఎంఎల్ఏ కొలుసు పార్థసారథి రంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టిని శివరామకృష్ణ, కాజ రాంబాబు, గోళ్ల రాజు, పార్టీ గ్రామ అధ్యక్షులు చింతారావు, ఎలికే లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



రంగమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్థసారథి

ఇండియన్ బ్యాంక్ మండవల్లి మేనేజర్‌గా దుర్గారావు

ప్రజాశక్తి - మండవల్లి

ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా బొంతు దుర్గారావు అందించిన సేవలు ఎనలేనివని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు భాస్కరరావు, అప్పారావు అన్నారు. ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్‌గా ఎనలేని సేవలందించి పాలకొల్లు మండలం పోడూరు బ్యాంకుకు బదిలీపై వెళ్తున్న దుర్గారావును స్థానిక బ్యాంకులో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎంతో ఉందన్నారు. ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వరమే బ్యాంకు పరమైన సేవలు అందించడంలో ఆయనకు సాటి ఎవరూ రారన్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన సురక్ష బీమా యోజన పై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసిన వ్యక్తి దుర్గారావు అని అన్నారు. ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్‌గా తాను పనిచేసిన కాలంలో రూ.84 లక్షల ఇన్సూరెన్స్ సొమ్మును బాధితులకు అందించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారని చెప్పారు. అంతేకాకుండా బ్యాంకు లావాదేవీలను రూ.122 కోట్లకు పెంచి ఖాతాదారులకు విశ్వాసాన్ని పెంచుకున్నామని తెలిపారు. ఆయన బదిలీ అనివార్యమని, ఆయన బదిలీ ఒకింత బాధను కల్పించినా అక్కడ కూడా ఇదేవిధంగా సేవలందించి మరిన్ని మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనను దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు.

దుర్గారావును అభినందిస్తున్న భాస్కరరావు, అప్పారావు

నేరాలు - ఘోరాలు

పరస్పర కేసులు నమోదు

ప్రజాశక్తి - ముసునూరు

రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఒకరిపై మరొకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం... ముసునూరు మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన ఉప్పె సుబ్బారావు గ్రామపంచాయతీకి చెందిన స్థలం ఆక్రమించుకుంటున్నాడని ఉప్పె నాగరాజు ఆంజనేయులు ప్రభుత్వ అధికారులకు స్పందనలో గతంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కక్షలు పెట్టుకుని ఉప్పె సుబ్బారావు కుటుంబ సభ్యులు, ఉప్పె ఆంజనేయులు కుటుంబ సభ్యులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో గాయాలపాలైన ఇరు కుటుంబసభ్యులు నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉప్పె ఆంజనేయులు కుటుంబసభ్యులను మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా బాధితుల ఆసుపత్రి క్రమంలో ఇరు కుటుంబీకులు ఒకరిపై ఒకరు పరస్పర ఫిర్యాదు చేసుకోగా ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శ్రీదీప్తిలో నాణ్యమైన విద్య, ఉత్తమ ఫలితాలు

స్కూల్ కరస్పాండెంట్ గిరిబాబు

గిరిబాబు

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్ఎస్‌సి 2024 పరీక్షల్లో శ్రీదీప్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి, విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. శ్రీదీప్తి విద్యాబోధనలో అపార అనుభవం, అంకితభావం, ఆశయసాధనతోనే ఈ ఫలితాలు సాధించామని స్కూల్ కరస్పాండెంట్ ఎల్.గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఎస్ఎస్‌సి పరీక్షల్లో 36 మంది హాజరైతే వారిలో 16 మంది 500 మార్కులకు పైగా సాధించారన్నారు. సామాన్య విద్యార్థులను సైతం అత్యుత్తమ ఫలితాలు వైపు నడపడం శ్రీదీప్తి ఇంగ్లీష మీడియం స్కూల్ ప్రత్యేకత అని చెప్పారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. అత్యధిక విద్యార్థులు, అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలు సైతం సాధించలేని ఫలితాలను పదుల సంఖ్యలో గల విద్యార్థులతో సాధించడం శ్రీదీప్తికి సాధ్యమని చెప్పారు. ఎల్‌కెజీ నుంచి ఐదో తరగతి వరకు యాక్టివిటీ బేస్డ్ ఎడ్యుకేషన్ అందిస్తున్నామని, డిజిటల్ స్మార్ట్ క్లాసెస్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో సృజనాత్మతక పెంచడానికి ప్రాజెక్టు పనులు, క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం, చేతిరాత, డ్యాన్స్, క్రీడలు వంటి పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై ప్రత్యేక ఇంగ్లీష్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని కంప్యూటర్ శిక్షణ తరగతులు, ఐఐటి ఫౌండేషన్ క్లాసెస్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులతో మమేకమయ్యే క్వాలిఫైడ్, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు.

శ్రీదీప్తి స్కూల్

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చరూ..!

రోడ్డుపైకి మురుగునీరు

విజృంభిస్తున్న దోమలు

రోగాల బారిన పడతామని ప్రజలు భయాందోళన

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో దళితవాడలోని ఎంపిపి పాఠశాల సమీపంలో ఇళ్లల్లో వాడుకున్న మురికినీరు రోడ్డు మీదకు వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు వాడుకున్న మురికినీరు రోడ్ల మీదకు చేరి గుంతల్లో నిల్వ ఉంటుందన్నారు. దీంతో దోమల విజృంభించి అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులతో పాటు విష జ్వరాల బారినపడి ప్రజలు కాళ్ల నొప్పులు, కాళ్ల వాపులు, కీళ్ల నొప్పులతో ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన చెందుతున్నారు. డ్రెయినేజీ పూర్తిగా పాడైపోవడంతో పాఠశాల సమీపంలో మురికి నీరు రోడ్ల మీదకు రావటంతో విద్యార్థులు అంటూ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రోడ్డుపైన మురుగునీరు

త్వరలో అన్నా క్యాంటీన్ల నిర్వహణ

ఏలూరు ఎంఎల్ఏ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రానున్న రోజుల్లో ప్రభుత్వం తరపున అన్నా క్యాంటీన్ నడపనున్నట్లు ఏలూరు ఎంఎల్ఏ బడేటి చంటి తెలిపారు. టిడిపి కూటమి గెలుపొందిన సందర్భంగా బడేటి చంటిచే నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఫైర్‌స్టేషన్ లో శనివారం నిర్వహించారు. మొదటిగా ఫైర్ స్టేషన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ 2024లో అత్యధిక మెజారిటీతో గెలుపొందడం, నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించినప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి లాగా సీట్లు వచ్చాయో ఇప్పుడు అదే విధంగా విభజన ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా అంతటి విజయం రావడం సంతోషంగా ఉందన్నారు. గత రెండేళ్లుగా నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ తరపున తిలక్ అతని బృందం అన్నదానం చేస్తున్న దగ్గర భారీ కేక్ కటింగ్ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. దాతలు ఎంతమంది ఉన్నప్పటికీ రెండు సంవత్సరాలు నిత్యం అన్నా క్యాంటీన్ నడపడం అనేది చాలా కష్టతరమైన విషయమని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం తరపున అన్నా క్యాంటీన్ నడపనున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రతిఒక్కరికీ ఏ పనైనా చేసి పెడతానని, ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం తిలక్ (నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్) మాట్లాడుతూ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి ఏలూరు ఎంఎల్ఏ చంటితో కేక్ కట్ చేయించడం సంతోషంగా ఉందన్నారు. గత 700 రోజుల నుంచి ఫైర్ స్టేషన్‌లో అన్నా క్యాంటీన్ నడుపుతున్నామని చెప్పారు. ఈ అన్నా క్యాంటీన్ కార్యక్రమానికి సహకరించిన దాతలందరికి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి కూటమికి ఘనవిజయం అందించినందుకు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ లింగంశెట్టి శశికుమార్, ఆర్ఎస్.సత్యనారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడేటి చంటిని అభినందిస్తున్న బాలకృష్ణ ఫ్యాన్స్

గుండుగొలనులో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరం

శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా మెడిసిన్ కోఆర్డినేటర్ నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను గ్రామంలో ప్రతినెలా శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సమితి జిల్లా మెడికల్ కో-ఆర్డినేటర్ కె.నరసింహమూర్తి తెలిపారు. శనివారం గుండుగొలనులో నిర్వహించిన శిబిరంలో సిహెచ్.పోతేపల్లికి చెందిన శ్రీ సత్యసాయి జనరల్ హాస్పిటల్ వైద్యులు రామకృష్ణ, ఆయన సిబ్బంది రోగులను పరీక్షించారు. వివిధ వైద్య పరీక్షల నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సమితి గుండుగొలను కో-ఆర్డినేటర్ జివి.సుబ్బారావు పాల్గొన్నారు. శ్రీ సత్య సాయి సేవా సమితి సభ్యులు సహకరించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

15 నుంచి రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభ

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఏలూరులోని టూబాకో మర్చంట్ కళ్యాణ మండపంలో జరగనున్న రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక జాబిల్లి అతిథి గృహంలో రాష్ట్ర నాయకులతో కలిసి మహాసభ వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజులపాటు జరగనున్న ఈ రాష్ట్ర మహాసభల్లో ప్రారంభ సభ, ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయని, వేలాదిమందిగా ఈ మహాసభల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభాలు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం, వారికి అందాల్సిన నష్టపరిహారాలపై చర్చలు జరుగుతాయని తెలిపారు. వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని వ్యవసాయ రంగ సంక్షోభం, పాలకుల విధానాలపై ప్రసంగిస్తారని తెలిపారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం కనీస మద్దతు ధర అనే అంశంపై నల్లమడ రైతాంగ సమితి నాయకులు కొల్ల రాజమోహన్, గ్రామీణ యువత నిరుద్యోగం వలసలు అనే అంశంపై జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, ఐపిఎస్ రిటైర్డ్ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు. దేశంలో రాష్ట్రంలో కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఆమె ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిలను డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం కారణంగానే మోడీకి సీట్లు తగ్గాయని ఆమె విమర్శించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ సమస్యలపై మహాసభల్లో చర్చించి తీర్మానించడం జరుగుతుందని, వేలాదిగా తరలివచ్చి మహాసభను జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్.నాగరాజు, రాష్ట్ర కోశాధికారి ఎస్.లలితకుమారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.భాష పాల్గొన్నారు.

రామోజీరావు మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనాడు సంస్థల అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త చెరుకూరి రామోజీరావు మృతి వార్త దిగ్భ్రాంతికి గురి చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ తరపున ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రామోజీరావు మృతికి పార్టీ జిల్లా కమిటీ తరపున తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తున్నామని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామని చెప్పారు. తెలుగు జర్నలిజాన్ని ఓ మలుపు తిప్పిన ఘనత రామోజీరావు గారికే దక్కిందని కొనియాడారు.

ఏలూరు టౌన్ : జర్నలిజం ద్వారా సమాజ శ్రేయస్సు కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, పేదల సమస్యల పరిష్కారం కోసం తన ఈనాడు పేపర్ ద్వారా, ఈటివి ద్వారా అహర్నిశలు పోరాటం చేసిన మహనీయుడు రామోజీరావు అని, ఆయన మృతి చాలా బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని దెందులూరు ఎంఎల్ఏ చింతమనేని ప్రభాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

కలిదిండి : రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు, తెలుగు భాషకు తీరని లోటని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుమాని పాండురంగారావు, నాగరాజు, కోకా తాతయ్య, ఒడుగు గణపతి, దున్న సత్యనారాయణ, రాజనాల పరశురామయ్య, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, వాతాడి రాంబాబు, బలగం పరమేశ్వరరావు పాల్గొన్నారు.

కామవరపుకోట : రామోజీరావు మరణం బాధాకరమని చింతలపూడి మాజీ ఎంఎల్ఏ ఘంటా మురళీ రామకృష్ణ అన్నారు. కామవరపుకోటలో సొసైటీ పెట్రోల్ బంక్ దగ్గర ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు ఘంటా మాధవరావు, కొయ్యగూర వెంకటేష్, కంఠమనేని అంజి మూర్తి, ఘంటా సత్యంబాబు, కామవరపుకోట గ్రామ కమిటీ అధ్యక్షుడు వజీర్ ఖాన్, పరస శ్రీనివాసరావు, షేక్ ఇబ్రహీం, పొన్నుబోయిన సురేష్, నన్న హరిచంద్ర పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : రామోజీరావు మృతి పట్ల జీలుగుమిల్లి పాత్రికేయులు శనివారం సంతాపం తెలిపారు. ఆయన మృతి పత్రిక రంగానికి తీరని లోటని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పత్రిక రంగం ఒక దిక్సూచిని కోల్పోయిందని ఆయన సేవలను కొనియాడారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు రాము, ప్రసాద్, రాఘవులు, మనోజ్, రామారావు, సాయి, సందీప్ పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమలలోని స్థానిక వైష్ణవి హోటల్‌లో ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి టిడిపి నాయకుడు ఇమ్మడి రత్నాజీ ఆధ్వర్యంలో టిడిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర సెక్రటరీ కూరాకుల బుజ్జి యాదవ్, నియోజకవర్గ వాణిజ్య సెల్ అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, మండల బీసీ సెల్ అధ్యక్షులు రేవూరి వెంకటేశ్వరరావు వనపాముల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : మీడియా సామ్రాజ్య మహారాజు ఎందరికో దార్శనికుడు, అక్షర యోధుడు, ఈనాడు గ్రూపు సంస్థల ఛైర్మన్, మేధావి చెరుకూరి రామోజీరావు అని నూజివీడు ఎంఎల్ఏ కొలుసు పార్థసారధి అన్నారు. టిడిపి కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చింతలపూడి : తెలుగు పత్రికా రంగం, ప్రచార మాధ్యమాల్లో విప్లవాత్మక మార్పులకు బీజం వేసిన మహనీయుడు రామోజీరావు అని చింతలపూడి ఎంఎల్ఏ రోషన్ కుమార్ అన్నారు. ఈనాడు అధినేత రామోజీరావు శనివారం ఉదయం మరణించగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్‌లో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు రామోజీరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నల్లూరి కృష్ణమోహన్, జనసేన నాయకులు దండాబత్తుల ఫణికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెట్టి మాధవ, రవీంద్ర, కరాటం శ్రీకాంత్, పసుపులేటి శ్రీను, కరిమికొండ శివాజీ, రవి పాల్గొన్నారు.

కుక్కునూరు : టిడిపి మండలాధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు) ఆయన ఇంటి వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు మేజర్ పంచాయతీ ఉప సర్పంచి పిచ్చుకల రాజు, ఎంపిటిసి సభ్యులు ముప్పాల శ్రీదేవి శివయ్య, లంకల రాజు, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ

భూములు కౌలుకు హక్కునకు టెండర్-కం-బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు మండలం, తణుకు పట్టణం శ్రీ తుమ్మలపల్లి కృష్ణ మూర్తి విశ్రాంతి భవనమునకు, అత్తిలి మండలం, వరిఘేడు గ్రామంలో సంపూర్ణ హక్కు భుక్తములో వివిధ ఆర్ఎస్. నెం.లలోని య.22.02 సెంట్లు వ్యవసాయ భూమిని 9 ప్రతులుగా 3 సంవత్సరములకు అనగా **2024-2025 సం.రం నుండి 2026-2027 సం.రం వరకు** గల కాలపరిమితికి కౌలు హక్కు అనుభవించుటకు గాను **ది.20.06.2024 వ తేది గురువారం ఉదయం గం.11.00 లకు** తణుకు దేవాదాయ శాఖ, ఇన్‌స్పెక్టర్ వారి సమక్షములో వరిఘేడు గ్రామములో వేంచేసి యున్న **శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయము** నందు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించబడును. ప్రతి పాటదారుడు ఆయా ప్రతులకు నిర్ణయించబడిన ధరావత్తు చెల్లించి సదరు టెండర్ కం బహిరంగ వేలములో పాల్గొనవలసినదిగా కోరడమైనది. పాట షరతులు పూర్తి వివరములు పాటకు ముందు చదివి వినిపించబడును. లేదా సత్రము భవనము కార్యాలయము నందు సంప్రదించవలెను.

NB : ఏ కారణము తెలుపక కౌలు హక్కు వేలం వాయిదా వేయుటకు FFM మరియు అధికారులకు సర్వ అధికారములు గలవు.

తేది.08.06.2024
తణుకు

F.F.M
సం/- T.N.S.V.S కృష్ణ మూర్తి
ఫోన్ : 94906 76903

తిరుపతికి టిడిపి నేత రఘుబాబు పాదయాత్ర

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి కూటమి గెలవాలని మండలంలోని గుడిపాడుకు చెందిన టిడిపి తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు వారం రోజుల క్రితం గుడిపాడు నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేపట్టారు. గూడురు వరకు వెళ్లిన ఆయనను శనివారం టిడిపి నూజివీడు డివిజన్ నాయకులు మధు, ఆది, మెదరమేట్ల సురేంద్ర, చెక్కపల్లి సర్పంచి సత్యనారాయణ, ఉప సర్పంచి కాటేపల్లి సత్యనారాయణ కలిసి అభినందనలు తెలిపారు.



రాజీనామా పత్రం అందిస్తున్న మధు

సొసైటీ ఛైర్‌పర్సన్ రాజీనామా

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కె.జగ్గవరం సొసైటీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో వైసిపి తరపున నామినేటెడ్ పదవిలో ఉన్న మధు తన పదవికి రాజీనామా చేసి పదవి నుంచి తప్పుకున్నారు. తన రాజీనామా పత్రాన్ని సిఇఒ తనగాల వీర వెంకయ్యకు స్థానిక సొసైటీలో శనివారం అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ తన పదవీ కాలంలో సొసైటీ అభివృద్ధికి సహకరించిన సంఘ పర్సన్‌లకు, రైతులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

పశుగ్రాసం వితరణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గోశాలలో ఉన్న గోవుల పోషణార్థం దాణాగా పశుగ్రాసాన్ని వితరణగా అందించడం ఎంతో అభినందనీయమని వేద పాఠశాల కార్యదర్శి సూరి శర్మ అన్నారు. మండల కేంద్రమైన ఆగిరిపల్లిలోని వేద పాఠశాలలోని గోశాలలో ఉన్న గోవులకు ఈదులగూడెం గ్రామానికి చెందిన నాయుడు రాము(పండు) రెండు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని వితరణగా అందించారు. ఈ సందర్భంగా వేదపాఠశాల సిబ్బంది, గ్రామస్థులు రామును ప్రశంసించారు.

ఉన్నత విద్యతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రతిఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యమని బంజారా భజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ తెలిపారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో శనివారం పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి విద్యార్థులకు చేతక్ మెరిట్ స్కాలర్ షిప్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజపుత్ర స్వతంత్ర పోరాట యోధుడు మహారాణా ప్రతాప్ స్వారీ చేసిన చేతక్ పేరు కలిగిన గుర్రం ప్రపంచంలోనే అత్యంత బలశాలి, వీర పరాక్రమం కలిగినదిగా ప్రసిద్ధి పొందిందన్నారు. ఈ చేతక్ గుర్రం యుద్ధ రంగంలో రాణించినట్లు విద్యార్థులు తమ చదువుల్లో ఉన్నత ప్రతిభను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బంజారా భజరంగీ భేరీ సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణప్రసాద్, చందా నాయక్, పూర్ణయ్య, వెంకా నాయక్, రమేష్ నాయక్, బిగనాథం నాయక్, రాజా నాయక్, ప్రమీలా దేవి, రవి నాయక్, రాజ శేఖర్ పాల్గొన్నారు.

పేరు మార్పు

నా పేరు గుండుమోగుల లక్ష్మీకృష్ణ రామాంజనేయులు (పాతపేరు), S/o.గోపాల స్వామి (లేటు) డోరునెం.3-30, వల్లూరుపల్లి గ్రామం, పెంటపాడు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. నేను నా పేరును గండుమోగుల లక్ష్మీ కృష్ణ తులసీ రామాంజనేయులు (కొత్తపేరు)గా మార్చుకున్నాను. ఇకపై నా పేరు గుండుమోగుల లక్ష్మీ కృష్ణ తులసీ రామాంజనేయులు (కొత్తపేరు) అన్ని ప్రయోజనాల కోసం

దావా సమను
మహారాజశ్రీ 4వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన) వారి కోర్టులో ఏలూరు (ఎక్సైజ్ కోర్టు)
O.S.104/2023
బిట్వీన్ :
తాడాల లక్ష్మీనారాయణ ...వాది
Vs
శ్రీమతి మల్లెమడుగుల మేరమ్మ & 1 అనదరు ...ప్రతివాదులు
2వ ప్రతివాది : మల్లెమడుగుల థామస్, S/o.బాబు, డోరునెం. 6-101, శనివారపుపేట, ఏలూరు, ఏలూరు జిల్లా.
పై నెంబరు గల దావాలో 2వ ప్రతివాది హాజరు నిమిత్తము శ్రీకోర్టు వారు పై నెంబరు దావాను **ది.26-06-2024**కు వాయిదా వేసినారు. కాబట్టి 2వ ప్రతివాది పై నెంబరు దావాలో **26-6-2024** తేదీన ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీకోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో 2వ ప్రతివాది పరోక్షమందు పై నెంబరు గల దావాను శ్రీకోర్టు వారు తీర్మానించెదరు అని తెల్పడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
శేశెట్టి అప్పారావు
ఏలూరు అడ్వకేటు
తేది.08.06.2024 సెల్: 8341885888